


# మనం



మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

బుధవారం | 25 | అక్టోబర్ | 2023 | పేజీలు : 6




-విద్యాక్షేత్రంగా సిద్దిపేట

-కేసీఆర్ లేనిది తెలంగాణ లేదు

-తెలంగాణ పాలపిట్ట కేసీఆర్

-దసరా వేడుకల్లో

మంత్రి హరీష్‌రావు



# ఎన్నటికైనా ధర్మమే గెలుస్తుంది



సిద్దిపేట, అక్టోబర్ 24, మనం న్యూస్ ప్రతినిధిః చెడుపై విజయానికి గుర్తుగా విజయదశమి పండు గను జరుపుకుంటామని, మీ అందరి ఆశీ స్సులు ఉంటే మరోసారి ప్రజలకు సేవ చేస్తామని మంత్రి హరీష్‌రావు అన్నారు. దసరా ఉత్సవాలను సిద్దిపేట జిల్లా కేం ద్రంలో నర్సాపూర్, రంగధాంపల్లి హను మాన్ దేవాలయాల్లో జరిగిన దసరా వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సిద్దిపేటకు ట్యాగ్‌లైన్ అయిన జిల్లా, గోదావరి జలాలు రైలును తెచ్చుకున్నామన్నారు. ఈ పండుగ ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. సిద్దిపేటకు రైలు రావడం ఒక దశాబ్ధ కల అని, అది నేడు నెరవేరిందన్నారు. రాబోయే రోజుల్లో సిద్దిపేట నుండి తిరుపతి, బెంగుళూరు వంటి నగరాలకు రైలు సేవలు అందనున్నాయన్నారు. తెలంగాణ పాలపిట్ట కేసీఆర్ అని, ఆయనకు అందరం అండగా నిలుద్దామన్నారు. చివరికి ధర్మమే గెలుస్తుందని, పాలపిట్ట సాక్షిగా ప్రమాణం చేసి మన మిగతా 2లో..

## అన్ని విజయాలు కలగాలి

ఆయుధ పూజలో పోలీస్ కమీషనర్ శ్వేత



2 లో

# ఒక్కటైన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

-కలిపిన దసరా పండుగ

-స్వయంగా ఎమ్మెల్సీ ఇంటికి ఎమ్మెల్యే

-ఎన్నికల స్టంట్ అంటున్న నియోజకవర్గ ప్రజలు

-మెదక్‌లో శరవేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు

మెదక్/పాపన్నపేట, అక్టోబర్ 24, మనం న్యూస్ః ఎంతో కాలంగా ఎడమొహం పెడమొహంగా ఉన్న మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ సీఎం రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డిలు ఏకమ య్యారు. దసరా సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే పద్మారెడ్డి స్వయంగా శేరి స్వగ్రామమైన కూచన్‌పల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు మిగతా 2లో..



## ఒక్కటైన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

మొదటి పేజీ తరువాయి..

దీంతో అనేక రోజులుగా దూరంగా ఉన్న వీరిద్దరూ ఒక్కటయ్యారని, ఎన్నికల్లో మద్ధతు కోసమే పద్మారెడ్డి ఒక మెట్టు దిగి శేరి ఇంటికి వెళ్లిందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ఇంతకు ముందు మెదక్ నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేసినా ఎవరికి వారే అన్న చందంగా ఉన్నారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ నియోజకవర్గంలో మైనంపల్లి హనుమంతరావు, వారి తనయుడు రోహిత్‌రావులు సుడిగాలి పర్యటనలు చేస్తూ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో భారీగా చేర్చుకుంటున్నారు. అదే స్థాయిలో నియోజకవర్గ కార్యకర్తలకు టచ్‌లో ఉంటున్నారు. పాత టిడిపి, బిఆర్ఎస్ నేతలను తమ వైపు లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోహిత్ రూపంలో తనకు గట్టి పోటీ ఏర్పడిందని భావించిన ఎమ్మెల్యే పద్మారెడ్డి శేరి మద్ధతు కోసం తన ఈగోను పక్కనపెట్టి శేరి సుభాష్‌రెడ్డినికలిసి దసరా శుభాకాంక్షలు తెలపడానికి వెళ్లిందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో రోజురోజుకు మెదక్‌లో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని షాకిచ్చే సంఘటనలు కూడా చూస్తామని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

## సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం

### డిసిసిబి వైస్ ఛైర్మన్ పట్నం మాణిక్యంను కలిసిన మంత్రి హరీష్‌రావు



సంగారెడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్ః ఈ ఎన్నికల్లో సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఇందుకు కార్యకర్తల కృషి ఎంతో అవసరమన్నారు. మంగళ వారం ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ ఛైర్మన్ పట్నం మాణిక్యంను ఆయన నివాసంలో మంత్రి హరీష్‌రావు కలిశారు. సుమారు గంటసేపు ఏకాంతంగా పట్నం మాణిక్యంతో మంత్రి హరీష్‌రావు చర్చలు జరిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ ఆదేశానికి కట్టుబడి పార్టీ అభ్యర్థిగా చింతా ప్రభాకర్‌కు అండగా ఉంటామని డిసిసిబి వైస్ ఛైర్మన్ మాణిక్యం భరోసా ఇచ్చారని మంత్రి తెలిపారు. పట్నం మాణిక్యంకు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాల్లో అవకాశం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన అనుచరులను కూడా పార్టీ కాపాడుతుందని భరోసా ఇచ్చారు. తదనంతరం ఆయన ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. తెలంగాణ పాలపిట్ట కేసీఆర్ అని, తెలంగాణలో కేసీఆర్‌ను ఒక వైపు, తెలంగాణ ఉద్యమకారులపై తుపాకి ఎక్కుపెట్టిన వ్యక్తులు మరో వైపు ఉన్నారన్నారు. ఓటుకు నోటు నోటుకు సీటు అనేది కాంగ్రెస్ వారి ఫార్ములా అని మంత్రి విమర్శించారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయని వ్యక్తి తెలంగాణను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రం కేసీఆర్ చేతిలో ఉంటేనే సుభిక్షంగా ఉంటుందని, కర్నాటక రైతులు తమ ప్రభుత్వాలను తిట్టుకుంటున్నారన్నారు. ఇక్కడ పథకాలు అక్కడ ఉన్నాయా..?మతం మంటలు కాంగ్రెస్‌చరిత్ర అని, దేశంలో కరెంటు కోతలు ఉంటే మనం నాణ్యమైన కరెంటు ఇస్తున్నామని పునరుద్ఘాటించారు. ధరణి వద్దు అంటే పటేల్ పట్వార్ వ్యవస్థను తెస్తారా..? అన్నారు. ధరణిలో లోపాలుంటే సరి చేస్తామని, కంప్యూటర్ మా నాన్న తెచ్చాడు అని రాహుల్‌గాంధీ అంటున్నాడని, ఇప్పుడు మేం చేసింది కూడా అదే కంప్యూటరీకరణ అని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి చింతా ప్రభాకర్, గ్రంథాలయ ఛైర్మన్ నరహరిరెడ్డి, గంగా నర్సరీ మోహన్, బీరయ్య యాదవ్, మామిళ్ల రాజేందర్, జలంధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నటికైనా ధర్మమే గెలుస్తుంది

మొదటి పేజీ తరువాయి..

పాలపిట్టకు అండగా నిలుద్దామన్నారు. వచ్చే బతుకమ్మ నాటికి సిద్దిపేట కోమటి చెరువుపై ఆర్టిఫిషియల్ బీచ్, శిల్పారామంలు ప్రారంభించుకుంటామన్నారు. జిల్లాలో నలువైపులా విద్యాలయాలు ఏర్పాటు చేసుకొని విద్యాక్షేత్రంగా మార్చు





కున్నామన్నారు. సిద్దిపేట అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఎన్నో అవార్డులు, ప్రశంసలు సిద్దిపేటకు దక్కాయన్నారు. ప్రజల భాగస్వామ్యముంటే ఎంతటి అభివృద్ధినైనా చేయవచ్చని, మీ అందరి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటే సిద్దిపేటను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతామన్నారు.





## అన్ని విజయాలు కలగాలి

### ఆయుధ పూజలో పోలీస్ కమీషనర్ శ్వేత

సిద్దిపేట, అక్టోబర్ 24, మనం న్యూస్ ప్రతినిధిః విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ విజయదశమి అని, ఈ విజయదశమి అన్ని విజయాలను అందించాలని సిపి శ్వేత ఆకాంక్షించారు. సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పెద్దకోడూరు గ్రామ శివారులోని సాయుధ దళాల కార్యాలయంలో సిపి శ్వేత దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా ఆయుధాలకు, ప్రభుత్వ వాహనాలకు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా సిపి





మాట్లాడుతూ చేసే ప్రతి పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు రాంచందర్‌రావు, సుభాష్‌చంద్రబోస్, అందె శ్రీనివాస్‌రావు, ఎస్. మల్లారెడ్డి, సిద్దిపేట ఏసిపి సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, పూర్ణచందర్, ప్రసాద్, రాజేష్, సిద్దిపేట సిఐ చేరాలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## పిఎస్ఎంఎల్ కాలనీలో ఘనంగా విజయదశమి వేడుకలు

సదాశివపేట, అక్టోబర్ 24, మనం న్యూస్ః సదాశివపేట పట్టణంలోని వార్డు నెంబర్ 9 పిఎస్ఎంఎల్ కాలనీలో కౌన్సిలర్ నల్ల శివలక్ష్మి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మొదట జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి రావణాసుర విగ్రహాన్ని దహనం చేశారు. అనంతరం కాలనీవాసులు జమ్మివృక్షం నుండి జమ్మి తీసుకొని ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నల్ల శివలక్ష్మి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ దసరా పండుగ అనేది చెడుపై మంచి గెలవడం అన్నారు. చెడు తొందరగా వ్యాపిస్తుందని, మంచి అనేది ఆలస్యంగా వ్యాపించినా అది ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుందన్నారు. భూమి మీద మంచి ఉండడం వల్లే సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండుతున్నాయని, లేనట్లయితే ప్రజాజీవమనేది కనుమరుగయ్యేదన్నారు. దైవం కూడా మంచిని సంరక్షిస్తూ చెడును శిక్షిస్తుందని తెలిపారు.



# దుబ్బాకలో కమల వికాసం ఖాయం



దౌల్తాబాద్, అక్టోబర్ 24, మనం న్యూస్ః త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో కమల వికాసం ఖాయమని దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజుపల్లి, సూరంపల్లి, ముత్యంపేట గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, కానీ నిరుద్యోగులకు కొలువులు మాత్రం ఇవ్వలేదని ఆరోపించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం దుబ్బాక నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్‌లు వచ్చినా ఏదో ఒక కారణంతో ప్రభుత్వం పరీక్షలను రద్దు చేయిస్తుందని మండిపడ్డారు. దళితబంధు, బిసిబంధు, డబుల్ బెడ్‌రూమ్, గృహలక్ష్మి పథకాలను బిఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చి పేద ప్రజలకు మొండిచేయి చూపిస్తుందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులను బలి తీసుకుంది తప్ప ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆయన విమర్శించారు. ప్రబుత్వం మూడు నెలల ముందే నోటిఫికేషన్‌లు వేసినా ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు. రాష్ట్రంలో మద్యానికి కొదువ లేదు కానీ నిరుద్యోగులకు ఉద్యోగాలు మాత్రం లభించడం లేదన్నారు. అనంతరం లింగరాజుపల్లి శివాజీ యూత్ ఆధ్వర్యంలో 21 మంది కాంగ్రెస్ పార్టీ నుండి ఇద్దరు బీజేపిలో చేరగా, వారికి ఆయన పార్టీ కండువా కప్పి బీజేపి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల పార్టీ అధ్యక్షులు కిషన్, మాజీ అధ్యక్షులు కుమ్మరి నర్సింలు, ఉపాధ్యక్షులు గడ్డమీద స్వామి, బొల్లం స్వామి, బీజేపి సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్, రామస్వామి గౌడ్‌తోపాటు బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# కొత్త ప్రభాకర్‌రెడ్డిపై బీజేపి నాయకుల విమర్శలు సరికావు

### -బీజేపికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారు

### -ఎంపిటిసి సుతారి నర్సింలు

మిరుదొడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్ః మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై బీజేపి నాయకులు విమర్శలు చేయడం సరికాదని మిరుదొడ్డి ఎంపిటిసి సుతారి నర్సింలు అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీజేపి నాయకులు తమకు ఇష్టం వచ్చినట్లు బీఆర్ఎస్ పార్టీపై, మెదక్ ఎంపికొత్త ప్రభాకర్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఉప ఎన్నికల్లో గెలిచిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం జరుగుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో బీజేపి, కాంగ్రెస్ నాయకుల డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. డిసెంబర్ 3న దుబ్బాక నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై బీజేపి నాయకులు ఇదేవిధంగా పిచ్చి కూతలు కూస్తే వారిని తగిన సమాధానం చెప్తామన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గొల్ల రాములు, తోకల




నగేష్‌రెడ్డి, గొట్టం రాధాకృష్ణ, దార మల్లయ్య, నేరెండ్ల పర్శరాములు, సాన యాదగిరి, అంజా గౌడ్‌తోపాటు తదితరులు ఉన్నారు.



## ఘనంగా విజయదశమి సంబరాలు

మిరుదొడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల వ్యాప్తంగా విజయదశమి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో విజయదశమి పండుగను పురస్కరించుకొని పాలపిట్టను చూసేందుకు గ్రామస్తులు కలసికట్టుగా డప్పు చప్పుళ్లతో వెళ్లి పాలపిట్టను చూసి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారం సేకరించి కులమతాలకు అతీతంగా ఒకరికొకరు ఆప్యాయంగా జమ్మి పంచుకుంటూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామాల్లో విజయదశమిని ఘనంగా నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పన్యాల వెంకటరెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు చాట్లపల్లి బాలమల్లేష్ గౌడ్, మాజీ సర్పంచ్ లింగాల వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ పంజా రాజుతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ జయరాములు ఆశయాలను నెరవేరుస్తాం



చేర్యాల, అక్టోబర్ 24, మనం న్యూస్ః కామ్రేడ్ కమలాపురం జయరాములు ఆశయాలను నెరవేరుస్తామని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కామ్రేడ్ జయరాములు 3వ వర్ధంతి సందర్భంగా చేర్యాల పట్టణ కేంద్రంలోని పెద్దమ్మ గడ్డ వద్ద ఉన్న జయరాములు స్థూపానికి మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపియం పార్టీ పట్ల విశ్వాసంతో సుదీర్ఘకాలంగా పార్టీలో మ్మకంతో పని చేసిన కార్యకర్త అని కొనియాడారు. చేర్యాల ప్రాంతంలో జరిగే అనేక పోరాటాల్లో ముందుండి పాల్గొన్నారన్నారు. చేర్యాల గ్రామ పంచాయతీ వార్డు సభ్యునిగా అనేక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించే దిశగా పని చేశారన్నారు. జయరాములు ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి కళావతి, రాళ్లబండి శశిధర్, చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో, నాయకులు పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, మేడిపల్లి చందు, బుట్టి చందు, జయరాములు కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి

## రజక సంఘం నాయకుల ఆర్థిక సాయం

జగదేవ్‌పూర్, అక్టోబర్ 24, మనం న్యూస్ః జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన రాచమల్ల బాలయ్య (65) కుటుంబ సభ్యులను మంగళవారం మండల రజక సంఘం నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మండల రజక సంఘం అధ్యక్షులు రాచమల్ల ఎల్లేష్ ఆధ్వర్యంలో పలువురు రజక నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు అక్కారం నర్సింలు, ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, రాచమల్ల శ్రీనివాస్, కోశాధికారి రాచకొండ బాల్‌నర్సయ్య, రజక సంఘం నాయకులు రాచకొండ సీతయ్య, కుమార్, స్వామి, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు భక్తిభావన కలిగి ఉండాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి సంపత్‌కుమార్



మిరుదొడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్ః ప్రతి ఒక్కరు భక్తి భావనతో పాటు దైవ చింతన కలిగి ఉండాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉంటూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఆరెపల్లి గ్రామంలో అమ్మవారిని ప్రతిష్టించడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే అమ్మవారిని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి గ్రామ ప్రజలు, ఉత్సవ సమితి సభ్యులు తోట నర్సింహారెడ్డి, పర్శరాములు, శేఖర్, తిరుపతితోపాటు తదితరులు ఉన్నారు.

# దుబ్బాక గడ్డ గులాబీ అడ్డా

## బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్‌: బీజేపి పార్టీలో సముచిత స్థానం లేకపోవడంతో బీజేపి నాయకులు బిఆర్ఎస్‌లో చేరడం జరుగుతుందని దుబ్బాక గడ్డ బిఆర్ఎస్ అడ్డా అని దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీజేపి పార్టీ కిసాన్ మోర్చ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ సత్తు రాజిరెడ్డి బీజేపి పార్టీని బిఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపి పార్టీలకు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. ప్రజలను మోసం చేయడానికే వారి రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం బిఆర్ఎస్‌పార్టీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బీజేపి, కాంగ్రెస్ నాయకుల మాటలు దుబ్బాక నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.





## అంగరంగ వైభవంగా
## దసరా ఉత్సవాలు




మిరుదొడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్‌: మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా దసరా ఉత్సవాలకు ఆయా గ్రామాల్లో దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మిరుదొడ్డి గ్రామంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం కూడా రావణాసురుని దహనకాండను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతారామ చంద్ర స్వామి సేవతో భక్తులు, గ్రామస్తులు భజనలు చేసుకుంటూ శివాజీ చౌరస్తాలో కాషాయ జెండా ఎగురవేసి పాత బస్టాండ్ వద్ద వైదిక నిర్వాహకులు విఠల రాజపున్నయ్య శర్మ ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గోల్డెన్ ఈగల్స్ ఆధ్వర్యంలో రావణ దహనకాండను బాణాసంచా పేల్చి నిర్వహించారు. దసరాపండుగ సందర్భంగా ఒకొరికొకరు అలాయ్‌బలాయ్ తీసుకుంటూ పండుగను నిర్వహించుకున్నారు.

## లింగారెడ్డిపల్లి నుండి భారీగా బీజేపిలోకి చేరికలు

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక, అక్టోబర్ 24, మనం న్యూస్‌: రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామం నుండి భారీ ఎత్తున పలువురు దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. అంతేకాకుండా దుబ్బాక నియోజకవర్గంలో గత రెండున్నరేళ్లలో అభివృద్ధి మార్పు రఘునందన్‌రావు ఆధ్వర్యంలో కనిపించిందని, భవిష్యత్తులోనూ ఎమ్మెల్యే రఘునందన్‌రావు నేతృత్వంలో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఆయనను గెలిపించుకుంటామన్నారు.



## ముగిసిన దేవి నవరాత్రుల ఉత్సవాలు



మిరుదొడ్డి, అక్టోబర్ 24, మనం న్యూస్‌: అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో నవరాత్రుల పాటు భక్తులచే విశేష పూజలందుకున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. వీరారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా కచేరి వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు నిత్యం వివిధ రకాల పూజలు నిర్వహించి సోమవారం సాయంత్రం డప్పు చప్పుళ్ళు, భాజాభజంత్రీలు, పోతరాజుల విన్యాసాల నడుమ దుర్గామాత ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అమ్మవారి ఊరేగింపు అనంతరం అమ్మవారి నిమజ్జనం చేశారు.

## మంత్రి హరీష్‌రావు సమావేశాన్ని విజయవంతం చేయాలి

### బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జేడిపల్లి రాంరెడ్డి



తొగుట, అక్టోబర్ 24, మనం న్యూస్‌: నేడు దుబ్బాకలో జరిగే బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి మంత్రి హరీష్‌రావు హాజరవుతున్నారని, ఈ సమావేశానికి తొగుట మండల బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జేడిపల్లి రాంరెడ్డి కోరారు. కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంత్రి హరీష్‌రావు, ఎంపి ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారని, దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల కోర్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ ప్రతినిధులు, సర్పంచ్, ఎంపిటిసిలతోపాటు తదితరులు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కేసీఆర్‌కు మద్ధతుగా ముస్లిం నాయకుల తీర్మానం

### హాజరైన ఎఫ్‌డిసి ఛైర్మన్, ఎమ్మెల్సీ



గజ్వేల్, అక్టోబర్ 24, మనం న్యూస్‌: వచ్చే ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని ముస్లిం నాయకులు, కో ఆప్షన్ మెంబర్లు, ఇమామ్ మౌజన్‌లు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని మదీనా ఫంక్షన్ హాల్‌లో మండల కో ఆప్షన్ సభ్యులు మజీద్ కమిటీ సభ్యులు ఇమామ్ మౌజన్‌లు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి



సుధాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానం చేసిన పకాపీని వారికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ సబ్బండ వర్గాలకు పెద్దపీట వేశారని, మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. షాదీ ముబారక్ ద్వారా రూ.1 లక్ష 116లు ఆర్థిక సాయం అందిస్తున్నారని, మైనార్టీ సోదరుల చదువుల కోసం మైనార్టీ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థికి లక్ష చొప్పున ఖర్చు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. తెలంగాణ అంటే గంగా జమున తహజీబ్ అని, అన్ని వర్గాలకు అందిస్తున్నట్లుగా ముస్లిం మైనార్టీ సోదరులకు కూడా నియోజకవర్గంలో షాదీఖానా ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి, వైస్ ఛైర్మన్ జకీయొద్దీన్, మజీద్ కమిటీ సదర్ సయ్యద్ యూసుఫ్, పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు జాఫర్ ఖాన్, మైనార్టీ నాయకులు ఖాజా విరాసత్ అలీ, రాష్ట్ర యూత్ నాయకులుజుబేర్ , జిల్లా కో ఆప్షన్ సలీం, ఏఎంసి డైరెక్టర్ సయ్యద్ మతిన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### రెడ్డిసేన ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారి శోభాయాత్ర



దుబ్బాక, అక్టోబర్ 24, మనం న్యూస్ః తొమ్మిది రోజుల పాటు భక్తులచే విశేష పూజలందుకున్న శ్రీ దేవి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. రెడ్డి సేన ఆధ్వర్యంలో దుబ్బాక పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద నెలకొల్పిన అమ్మవారికి చివరి రోజైన మంగళ వారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం నుండి అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. డిజే పాటలు, భక్తుల నృత్యాల నడుమ విద్యుత్ కాంతుల ధగధగల మధ్య అమ్మవారిని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గుండెల్లి భరత్‌రెడ్డి, గన్నె నిఖిల్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, రమణరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాతూరి భాను రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఏడుపాయల్లో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



పాపన్నపేట, అక్టోబర్ 24, మనం న్యూస్ః తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల శ్రీ వనదుర్గామాత దేవస్థానం నందు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రతి రోజు ఒక్కో రూపంలో దుర్గామాత దర్శనమిచ్చారు. స్థానిక గోకుల్ షెడ్‌లో దుర్గామాత ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకలకు ప్రముఖ నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**-నిమజ్జనంలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

చివరి రోజైన సోమవారం నాడు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వన దుర్గామాతను దర్శించుకొని స్థానిక గోకుల్ షెడ్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన దుర్గామాత పల్లకి సేవలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మంజీరా నది పాయల్లో దుర్గామాతను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి చైర్మన్ బాలా గౌడ్, కార్యనిర్వహణాధికారి మోహన్‌రెడ్డి, పాలకమండలి ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజాధనంతో కట్టి... ప్రచార అస్త్రమా

- నాసిరకం పనులతోనే ప్రజాధనం నీళ్లపాలు
- మేడిగడ్డ బ్యారేజీ వంతెన కుంగిపోవడమే నిదర్శనం
- కేంద్రం కావాలనే లైట్ తీసుకుంది
- మోటర్లు మునిగిన, పిల్లర్లు కుంగినా రహస్యమేనా
- బాధ్యుల పై చర్యలు తీసుకోవాలంటూ ఠాణాలో ఫిర్యాదు
- నేడు కాళేశ్వరం సందర్శనకు పొన్నం పిలుపు

హుస్నాబాద్,అక్టోబర్ 24,(మనం న్యూస్)ః లక్షల కోట్ల ప్రజా ధనంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ ప్రచార అస్త్రంగా వాడుకోవడం సిగ్గుచేటని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ విమర్శించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి బాధ్యులెవరో వారి పై చర్యలు తీసుకోవాలంటూ ఆయన ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కట్టిన బ్యారేజీల నిర్మాణంలో నాసిరకం పనుల వల్లే ప్రజాధనం నీళ్ల పాలైందని ఆయన మండి పడ్డారు. ప్రాజెక్టులోని లోపాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయని ఆయన తెలిపారు. మోటర్లు మునిగిన, ఫిల్లర్లు కుంగినా రహస్యమేనా అంటూ ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని లోపాల పై కేంద్రం కావాలనే లైట్ తీసుకుందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల డిమాండ్‌తోనే సెంట్రల్ టీమ్ వచ్చిందని ఆయన స్పష్టం చేసారు. రాష్ట్ర సర్కార్ రీ-డిజైన్ పేరుతో కేసీఆర్ సొంత ఆలోచనతోనే ప్రజల సొమ్మును బీఆర్ఎస్ దండుకుందని ఆయన ఆరోపించారు.






మొన్న బాహుబలి మోటర్లు మునిగిపోయాయిని ఆయన గుర్తు చేసారు. రీ-డిజైనింగ్ వద్దని పదేపదే చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఘటన పై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేసారు. నేడు ఛలో కాళేశ్వరంకు ఆయన పిలుపునిచ్చారు. కుంగిపోయిన మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల నుండి రైతులు, మేధావులు, పాత్రికేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులను తీసుకెళ్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపిస్తామని ఆయన పేర్కొన్నారు. కుట్ర దాగి ఉందని చెబుతున్న ప్రభుత్వానికి సిగ్గు ఉండాలన్నారు. నాణ్యత లేని పనులు జరిగాయి కాబట్టే తప్పించుకోవడానికి కుట్ర కోణం దాగి ఉందని ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు కేడం లింగమూర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, ఆయా మండలాల అధ్యక్షులు బంక చందు, కంది తిరుపతిరెడ్డి, జంగపల్లి ఐలయ్య, మంద ధర్మయ్య, కౌన్సిలర్‌లు వల్లపు రాజు, భూక్య సరోజన, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత, నాయకులు ఎం.డీ.హసన్, వడ్డేపల్లి వెంకటరమణ, తదితరులున్నారు.

## గజ్వేల్‌లో మారనున్న రాజకీయాలు

### ఈటల రాజేందర్‌ను కలిసిన పలువురు నాయకులు

గజ్వేల్, అక్టోబర్ 24, మనం న్యూస్ః దసరా పండుగ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన వివిధ మండలాల నాయకులు బీజేపి గజ్వేల్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ వారితో మాట్లాడుతూ గజ్వేల్‌లో త్వరలోనే రాజకీయం మారనుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపి విజయం చరిత్ర సృష్టించాలన్నారు. సీఎం కేసీఆర్‌పై అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మీపైనే ఉందని, ప్రజల్లోకి బిఆర్ఎస్ చేస్తున్న అరాచకాలను, అవినీతి పాలనను తీసుకువెళ్లాలన్నారు. అతి త్వరలో గజ్వేల్‌లో బీజేపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా బీజేపిలోకి పలువురి చేరికలు ఉంటాయని ఆయన తెలిపినట్లు సమాచారం .



# డబ్బు, మద్యం రవాణాను అరికట్టేందుకు తనిఖీలు

### 24 గంటలు వాహనాల తనిఖీ

### డబ్బులు పంచితే డయల్ 100కి సమాచారమివ్వాలి

### హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్

హుస్నాబాద్,అక్టోబర్ 24,(మనం న్యూస్)ః తెలంగాణ అసెంబ్లీ 2023 ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం రవాణాను అరికట్టేందుకు 24 గంటలు వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్, హుస్నాబాద్ సి.ఐ.కిరణ్, సెంట్రల్ ఫోర్స్ (సశాస్త్ర సీమ బాల్ బలగాలు)ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. ఆనంతరం ఏసిపి వాసాల సతీశ్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం రవాణా జరగకుండా వాహనాల తనిఖీలను నిర్వహిస్తోన్నట్లు ఆయన పేర్కొన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్లేవారు తప్పకుండా ఆ డబ్బులకు సరియైన పేపర్లు ఉండాలని ఆయన సూచించారు. లేని యేడల ఆ డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎవరైనా



అక్రమంగా మద్యం, డబ్బులు పంచుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100 కి కాల్ చేసి సమాచారమందించాలని ఆయన సూచించారు.



పోలీస్ కమీషనర్ శ్వేత ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని ఆయన కోరారు. ఈ వాహనాల తనిఖీలో హుస్నాబాద్ సబ్‌ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్, అక్కనపేట సబ్‌ఇన్‌స్పెక్టర్ తాండ్ర వివేక్, కోహెడ సబ్‌ఇన్‌స్పెక్టర్ తిరుపతి, పోలీస్ సిబ్బంది, సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది, తదితరులున్నారు.